# ఎంజీఎంలో 77మందికి మెమోలు

**విధుల్లో నిర్లక్ష్యం, అనుమతి లేకుండా గైర్హాజరైన వైద్యులు, ఉద్యోగులపై చర్యలు**

వరంగల్ చౌరస్తా, మే 26 : విధుల్లో నిర్లక్ష్యం ఉన్న ఎంజీఎం వైద్యులు, ఉద్యోగులపై కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యాధికారులు చర్యలు తీసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అనుమతి లేకుండా గైర్హాజరైన 77మందికి సోమవారం మెమోలు జారీ చేశారు. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు ఎంజీఎం హాస్పిటల్‌ని ఆకస్మిక తనిఖీ చేసి, వైద్యుల గైర్హాజరు, పారిశుధ్యం అధ్వానం ఉండడంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఫోన్లో కోరారు. ఈమేరకు కలెక్టర్ సత్యశారద స్పందించి ఉద్యోగుల నుంచి వివరణ తీసుకోవాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌ను ఆదేశించారు. ఈమేరకు ప్రాథమిక విచారణ జరిపి రిజిస్టర్‌లో సంతకాలు చేయని, విధులకు హాజరుకాని వారికి మెమోలు జారీ చేశారు. కాగా ఎంజీఎం చరిత్రలో ఒకే రోజు ఇంతమందిపై చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి అని ఎంజీఎం ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు.



హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో సత్యవతి రాథోడ్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## మాజీ మంత్రి సత్యవతికి కేటీఆర్ పరామర్శ

మహబూబాబాద్ రూరల్, మే 26 : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న ఆమె ఇటీవల యశోదలో శస్త్ర చికిత్స చేయించుకోగా కేటీఆర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సత్యవతి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని ఆరోగ్యం కుదుటపడిన తర్వాత మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## రూపాయి ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు

- నీలిమ హాస్పిటల్‌లో ఏటా 50వేల మందికి ఉచిత వైద్యం
- ప్రజారోగ్యం కోసం ప్రతీనెలా రూ.కోటికి పైగా వ్యయం
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో స్టేట్‌లో మనమే ఫస్ట్
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 26 (నమస్తే తెలంగాణ) : జనగామ నియోజకవర్గంలో రేషన్‌కార్డు ఉన్న వారు ఘట్‌కేసర్‌లోని నీలిమ హాస్పిటల్‌కు గత ఏడాదిన్నరగా రోజుకు 350నుంచి 500 మంది చొప్పున ఏటా 50వేల మంది వైద్యసేవలు పొందుతున్నారని వీరి కోసం తాను నెలనెలా సుమారు రూ.కోటిపైగా ఖర్చుచేస్తున్నానని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జనగామలోని క్యాంపు కార్యాలయంలో జనగామ అర్బ న్, రూరల్, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మం డలాలకు చెందిన 82మందికి రూ.2.46కోట్ల విలువైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ జాబితాలో రాష్ట్రంలోనే జనగామ నియోజకవర్గం ముందు వరుసలో ఉన్నదని, లబ్ధిదారులు చెక్కులను సకాలంలో బ్యాంకు ఖాతా లో జమ చేసుకోవాలని ఆయన సూచించారు. అసెంబ్లీలో అంశాన్ని లేవనెత్తి జనగామలో సిటీ స్కాన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, పేద లు వైద్యం కోసం ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రితో పాటు నీలిమ దవాఖాన సేవలు కూడా ఉపయోగించుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారందరూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా చితికిపోకుండా తన వంతు సహకారం అందిస్తున్నానని, మున్ముందూ పేదల ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పనిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

### దేవాదుల మోటర్లకు రూ.6కోట్లు ఇవ్వలేరా?

పంటలు ఎండిపోయి అల్లాడుతున్న ఎగువ ప్రాంతమైన జనగామ జిల్లా రైతాంగానికి సాగు నీరందించే గండిరామారంలోని నాలుగు దేవాదుల మోటర్ల నిర్వహణకు రూ.6 కోట్లు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని ఎమ్మెల్యే పల్లా ధ్వజమెత్తా రు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు, గత బీఆర్‌ఎస్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలకు డబ్బులు లేవు కానీ అందాల పోటీలకు మాత్రం రూ.100 కోట్లు ఖర్చుపెట్టడం సిగ్గుమాలిన పనిగా అభివర్ణించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తాగు, సాగునీరు, రైతుబంధు, రైబీమా, పింఛన్, కల్యాణలక్ష్మి, కేసీఆ ర్ కిట్ ఇస్తే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇవ న్నీ పోయాయన్నారు. కేవలం అందాల పోటీలు ఒక్కటే వాళ్లకు నచ్చిందని వందల కోట్లు పెట్టి స్పాన్సర్లను తీసుకొచ్చి వాళ్లందరిని ఎలా ఇబ్బంది పెట్టారో పత్రికల్లో అందరూ చూస్తున్నారని మండిపడ్డారు. అసలు ఈ పోటీలు ఎందుకు పెట్టారో ప్రజలకు ప్రభుత్వం జవాబు చెప్పాలని, అన్ని విషయాలపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజల మధ్య చర్చ పెట్టాలని కోరారు. కేసీఆర్ పదేళ్లలో 11సార్లు రైతుబంధు వేశారని ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు.. 420 హామీలు నెరవేర్చేదాకా ప్రతిపక్షపార్టీగా కొట్లాడుతానని అన్నారు. అదనులో 2నెలలు మోటార్లు బంద్ చేసి గోదావరిలో నిల్వ ఉన్నా నీళ్లు తెచ్చి రైతులకు ఇవ్వలేని తెలివితక్కువ ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదన్నారు. పైసల్ లేవు.. అప్పులు అయ్యాయని బదనాం చేసి కేసీఆర్‌ను ఇబ్బందిపెట్టే ప్రయత్నం తప్ప కాంగ్రెస్ పాలనలో ఒక్క ఎకరానికీ నీళ్లిచ్చింది లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, నాయకులు ముస్త్యాల దయాకర్, వాంకుడోతు అనిత, ఉల్లెంగుల సందీప్, జూకంటి శ్రీశైలం, పంతులు ప్రభాకర్‌రావు, ఉడుగుల నర్సింహులు, రామకృష్ణ, మామిడాల రాజు, బచ్చన్నపేట మండల నాయకులు చంద్రారెడ్డి, ఇర్రి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు


## 3వ లైన్ పనుల్లో వేగం పెంచాలి

- ఇబ్బందుల్లేకుండా 4వ ప్లాట్‌ఫాం నిర్మించాలి
- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ఢిల్లీ వెళ్లే ట్రైన్లకు హాల్టింగ్ ఇవ్వాలి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, మే 26 : మహబూబాబాద్ రైల్వేస్టేషన్లో ప్రజలకు సౌకర్యాలను కల్పించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. సోమవారం రైల్వే అధికారులతో కలిసి స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైల్వేస్టేషన్ పట్టణం నడిబొడ్డున ఉన్నందున పాత బజార్, కొత్త బజార్ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం స్టేషన్‌లో మూడవ లైన్ పనులు జరుగుతున్నాయని, దీనికనుగుణంగా నాల్గో ప్లాట్‌ఫాం నిర్మించపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని అధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. స్టేషన్ నుంచి బయటకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలన్నారు. మానుకోట ప్రాంతంలో అధిక సంఖ్యలో గిరిజనులు, మార్వాడీలు ఎక్కువగా ఇక్కడినుంచే వ్యాపారాలు చేస్తున్నారని, వారికి ఢిల్లీ వంటి సుదూర ప్రాంతాల వైపు వెళ్లేందుకు రైళ్లకు స్టేషన్‌లో హాల్టింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్, ఖమ్మం స్టేషన్‌లో కంటే కూడా మానుకోటకు ఎక్కువ ఆదాయం వస్తున్నందున ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. మహిళా ప్రయాణికులకు వీలైనంత ఎక్కువగా విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, సరిపడా మరుగుదొడ్లు కట్టించాలని సూచించారు. స్టేషన్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న మూడో లైన్ పనులు వేగంగా పూర్తి చేసి రైల్వే స్టేషన్ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పనుల పర్యవేక్షణకు వచ్చిన సికింద్రాబాద్ డివిజన్ ఏడీఆర్‌ఎం రాధాకృష్ణన్‌కు ఎమ్మెల్సీ రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కలిసి స్టేషన్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మంగళంపల్లి కన్న, కరుణాకర్‌రెడ్డి, వెంకటాద్రి, అంబరీష, రామక్రిష్ణ, మడత వెంకన్న, శిక, గోపి, శంకర్ పాల్గొన్నారు.




స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# పుష్కర ఘట్టం.. పరిసమాప్తం

**చివరి రోజూ కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు**

- త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు
- కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి మొక్కులు
- పూర్ణాహుతితో ముగిసిన హోమాలు
- నవరత్న మాల హారతి సమర్పించిన కాశీ వేద పండితులు

కాళేశ్వరంలో 12 రోజులుగా కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాల ఘట్టం సోమవారంతో పరిసమాప్తమైంది. చివరి రోజు కావడంతో వివిధ రాష్ర్టాలకు చెందిన లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమానికి చేరుకొని నదిలో పవిత్ర పుణ్య స్నానాలాచరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని ఆలయం ఆధ్వర్యంలో అందజేసిన ఉచిత ప్రసాదాన్ని స్వీకరించారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు దంపతులు, ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్ దంపతులు, ధర్మపురి శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వీఐపీ ఘాట్‌లో పుష్కర స్నానమాచరించి కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- మహదేవపూర్ (కాళేశ్వరం), మే 26



పుష్కరఘాట్‌లోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

### కిక్కిరిసిన త్రివేణి సంగమం

సరస్వతీ పుష్కరాలకు ఆఖరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో త్రివేణి సంగమం, ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో నదివైపు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో భక్తులు కాలినడకన త్రివేణి సంగమానికి చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించారు. 'పాహిమాం సరస్వతీ మాతా.. మమ్ముల క్షేమంగా చూడు తల్లీ' అంటూ భక్తులు వేడుకున్నారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం కోసం క్యూలో నిల్చున్న పలువురు భక్తులు సొమ్మసిల్లి పడిపోగా రెస్క్యూ సిబ్బంది వారికి సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించారు. పలుచోట్ల ట్రాఫిక్ జామ్ కావడం, ఎండ తీవ్రంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.



పూర్ణహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

### పూర్ణాహుతితో..

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర ప్రజలకు సంపద, ఆరోగ్య వృద్ధి, పాడి పంటల శుభఫలితాల కోసం 12 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన హోమాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు, ఈవో మహేశ్ పాల్గొన్నారు. ప్రజల ఆర్థిక, శారీరక శ్రేయస్సు, వ్యవసాయోత్పత్తి అభివృద్ధి జరగాలనే ఆకాంక్షతో 12 హోమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు. పూర్ణాహుతి సందర్భంగా శాంతి, ఐశ్వర్యం, సమృద్ధిని కోరుతూ వేదపండితులు విశేష పూజలు చేశారని శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. కాగా, చివరి రోజైన సోమవారం సాయంత్రం ఘాట్ వద్ద సరస్వతీ నవరత్న మాల హారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య కాశీ పూజారులు నిర్వహించగా భక్తి పారవశ్యంతో ప్రజలు వీక్షించారు.



సరస్వతీ నవరత్న మాల హారతి ఇస్తున్న కాశీ పూజారులు

### బస్సులు లేక పాట్లు..

పుష్కరాలకు వచ్చిన భక్తులు తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లేందుకు బస్సులు లేక అనేక అవస్థలు పడ్డారు. ఆలయం నుంచి కాలినడకన తాత్కాలిక బస్టాండ్‌కు చేరుకొని బస్సుల కోసం గంటల సమయం నిరీక్షించారు. రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడం, కాళేశ్వరం-భూపాలపల్లి రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు నానా పాట్లు పడ్డారు.



అస్వస్థతకు గురైన భక్తురాలికి ఆక్సిజన్ అందిస్తున్న రెస్క్యూ సిబ్బంది

### బోటులో భక్తుల షికారు..

పుష్కరాలకు వచ్చిన భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం బోటులో తిరుగుతూ ఎంజాయ్ చేశారు. నదీ తీర అందాలను తమ కెమెరాల్లో బంధించడంతో పాటు సెల్ఫీలు దిగుతూ మురిసిపోయారు. లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో త్రివేణి సంగమ తీరం కాశీని తలపిస్తున్నదని భక్తులు అభిప్రాయపడ్డారు. 'హరహర మహాదేవ.. శం భో శంకర' అంటూ స్వామిని స్మరించుకున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న బస్సు

### ప్రైవేట్ బస్సు దగ్ధం

పుష్కరాలకు భక్తులను తీసుకొని వచ్చి తిరిగి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ప్రమాదవశాత్తు సోమవారం దగ్ధమైంది. సిరిసిల్ల నుంచి కాళేశ్వరానికి వచ్చిన భక్తులు పుష్కర స్నానమాచరించిన అనంతరం తమ స్వస్థలానికి వెళ్తుండగా మహదేవపూర్ మండలం బలిజపూర్ ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బస్సు కాలిపోయింది. ఘటనా స్థలానికి రెండు అగ్ని మాపక యంత్రాలు చేరుకొని మంటలను ఆర్పి వేశాయి. వెంటనే అప్రమత్తమైన భక్తులు బస్సు దిగడంతో అందరూ సురక్షితంగా ఉన్నారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేస్తున్న సీఎస్ దంపతులు

## రద్దీ స్టేషన్.. రద్దుతో పరేషాన్

- రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు
- మానుకోటలో హాల్టింగ్ ఎత్తివేతతో తప్పని పాట్లు

మహబూబాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ) : కాజీపేట-కొండపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మూడో లైన్ పనుల్లో భాగంగా నాన్ ఇంటర్ లాకింగ్ కోసం ఇప్పటికే పలు రైళ్లను అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం కాజీపేట నుంచి విజయవాడకు వెళ్లే పుష్పుల్ రైలుతో పాటు సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ, శాతవాహన, గోల్కొండ రైళ్లను రద్దు చేశారు. ఇలా పలు రైళ్లను రద్దు, మానుకోట రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేయడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్ప డం లేదు. మహబూబాబాద్‌లో ఆగే 17 రైళ్లను తాత్కాలికంగా కేసముద్రం రైల్వేస్టేషన్లలో ప్రత్యేక హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడో లైన్ పనుల వల్ల మానుకోట స్టేషన్‌లో రైళ్లు ఆగవని రైల్వేస్టేషన్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

**నిత్యం వేలాదిగా రాకపోకలు..**


మానుకోట జిల్లాకేంద్రమైన తర్వాత వ్యాపార, వాణిజ్య పరంగా రవాణా విపరీతంగా పెరిగింది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఇక్కడినుంచి వరంగల్, కాజీపేట, హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, విజయవాడ, గుంటూరుకు వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రోజూ నడిచే రైళ్లలో కొన్ని రద్దు కావడం, మరి కొన్ని రైళ్లు నడిచినా మానుకోటలో హాల్టింగ్ లేకపోవడం వల్ల ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సోమవారం ఉదయం ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మానుకోట రైల్వేస్టేషన్‌లలో జరుగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. అలాగే రెండో నంబర్ ప్లాట్‌ఫారం వైపు మరో ప్లాట్‌ఫారం నిర్మించాలని సూచించారు. సోమవారం తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ప్లాట్‌ఫారం దాటి రైల్వే గేట్ సమీపంలో ఆపడంతో ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులు ఉరుకులు పరుగులు తీయాల్సి వచ్చింది. అలాగే నాగర్‌సోల్ రైలును ప్లాట్‌ఫారం ఉండే లైను కాకుండా మెయిన్ లైనులో కొద్దిసేపు నిలిపారు. దీంతో ప్లాట్ ఫారం మీద ఉన్న ప్రయాణికులు కిందికి దిగి రైలు ఎక్కాల్సి వచ్చింది. బుకింగ్‌లో టికెట్లు ఇవ్వకుండా, స్టాఫ్ లేదని చెప్పినా వినకుండా ప్రయాణికులు ప్లాట్‌ఫారం మీద వందలాది వేచిచూస్తున్నారని, రైల్వే అధికారులు చెబుతుండగా, స్టాఫ్ లేకుంటే కేసముద్రం రైల్వేస్టేషన్ దాకా ఎలా వెళ్లాలని, అది తమకు అదనపు భారమేనని ప్రయాణికులు ఆవేదనతో చెప్పారు.



ట్రైన్లు లేక బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

## కడియం.. దమ్ముంటే బైండ్ల సమ్మేళనం పెట్టు

- సీఎం నయా పైసా పుడతలేదంటడు
- శ్రీహరి కోట్లు ఖర్చు పెడుతున్నా అంటుండు
- నియోజకవర్గాన్ని నేనే అభివృద్ధి చేశా..
- కూతురితో సహా కడియం బీజేపీలో చేరడం ఖాయం
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘనపురం, మే 26 : కడియం శ్రీహరికి దమ్ముంటే బైండ్ల ఆత్మీయ సమేళనాన్ని ఏర్పాటు చేసి మొదట ఆ వర్గం అభిమానాన్ని పొందాలని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉండి మాదిగబిడ్డలను ఎన్‌కౌంటర్ చేయించిన ఘనత ఆయనదని, అలాంటి వ్యక్తి వారి ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావడం హాస్యాస్పదమన్నారు. సోమవారం జనగామ జిల్లా లింగాలఘనపురంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ బస్వగాని శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓ పక్క తనను ఎవరూ నమ్మడం లేదని, నయాపైసా అప్పు పుడతలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తుంటే.. కడియం మాత్రం నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 8 నెలల్లోనే నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశానన్నారు. తనకు రాజకీయ గురువు దివంగత వైస్ రాజశేఖర్‌రెడ్డి అయితే.. తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రిగా గౌరవం కల్పించిన గురువు మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తనకు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మంత్రి పదవి ఇవ్వడంతో పాటు కూతురుకు ఎంపీ టికెట్ ఇచ్చిన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన కడియం రూ. 200 కోట్లకు కాంగ్రెస్‌కు అమ్ముడుపోయారన్నారు. కేంద్ర మంత్రి పదవి కోసం కూతురుతో సహా బీజేపీలో చేరడం ఖాయమన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది తానేనని, కాదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, లేదంటే కడియం తన పదవికి రాజీనామా చేయాలని రాజయ్య సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షులు ఏదునూరి వీరన్న, దుంబాల భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చౌదరపెల్లి శేఖర్, నాయకులు గండి యాదగిరి, ఉడుగుల బాగ్యలక్ష్మి, కేమిడి యాదగిరి, వెంకటేశ్, కరుణాకర్, కడ్దూరి సోంరెడ్డి, చౌదరపెల్లి పూర్ణచందర్, చంద్రయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 8వ పేజీలో..